## క్లుప్తంగా

### ఘనంగా మోదమాంబ ఒడ్డు పండగ


ఎం.కోడూరులో ఘటాలతో మోదమాంబ ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులో మోదమాంబకు ఆదివారం భక్తులు ఒడ్డు పండగ నిర్వహించారు. గ్రామానికి చెందిన జాజిమొగ్గల వరహామూర్తి లక్ష్మి కుటుంబ సభ్యులు వరాహచంద్ర శ్రీనివాసు, వైకుంఠ వాసు, నవీన్ కుటుంబ సభ్యుల సారథ్యంలో 51 ఘటాలతో ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

### ఊబిలో చిక్కుకొని పాడిగేదె మృతి



రావికమతం : మరుపాకలోని కనుముల చెరువు ఊబిలో చిక్కుకొని పాడి గేదె మృతి చెందింది. మరుపాక పంచాయతీ శివారు దాసరయ్యపాలేనికి చెందిన గంట్ల ప్రసాద్‌కు చెందిన పాడి గేదె ఆదివారం మరుపాక గ్రామానికి చెందిన కనుముల చెరువు సమీపానికి మేతకు తీసుకెళ్లారు. గేదె మేస్తూ సమీపంలో గల కనుముల చెరువులో నీరు కోసం దిగి ఈదుకుంటూ లోపలికి వెళ్లింది. చెరువులో ఊబి ఉండడంతో దాంట్లో చిక్కుకుంది. ఊబిలో చిక్కుకున్న గేదెను రక్షించేందుకు సమీపంలో ఉన్న రైతులు ప్రయత్నించారు. చాలా సేపటి తర్వాత ఒడ్డుకు చేర్చారు. అప్పటికే గేదె మృతి చెందిందని రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదె రూ. 60 వేలు ఖరీదు చేస్తుందని రైతు తెలిపారు.

### గండిపడాల కుటుంబ సభ్యులకు పరామర్శ


రాములమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి : మండల సీనియర్ నాయకుడు, కాంట్రాక్టర్ గండిపడాల అప్పలరాజు మాతృమూర్తి గండిపడాల రాములమ్మ (85) సంతాప సభ దేవరాపల్లిలో ఆదివారం జరిగింది. రాములమ్మ చిత్రపటానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రాములమ్మకు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ తదితరులు ఉన్నారు.

### ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రోలుగుంటలో సమావేశమైన ఆర్సీఎం పూర్వ విద్యార్థులు

రోలుగుంట : వారందరూ ఆరు పదుల వయస్సు దాటిన వారే. పెదబొడ్డేపల్లి ఆర్సీఎం (రోమన్ కేథలిక్ మిషనరీ) హైస్కూల్లో 1976–77 వరకూ (పదో తరగతి) వరకూ చదువుకొని వేర్వేరు చోట్ల ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానాలు అధిరోహించి పదవీ విరమణ చేశారు. కొందరు వ్యాపారం, వివిధ జీవనోపాధిలో స్థిరపడ్డారు. సుమారు 48 సంవత్సరాలు తరువాత తిరిగి తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. వైజాగ్‌లో స్థిరపడిన పి.వి.ఆర్.మూర్తి, అబ్దుల్ ఖాదర్ తమతో అప్పట్లో చదువుకున్న నాటి మిత్రుల చిరునామాలు సేకరించి నర్సీపట్నంకు చెందిన కె.శివసత్యనారాయణ, ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ పి.బాబూరావుతో కలిసి గ్రూపు ఏర్పాటు చేశారు. అందరూ కలిసి రోలుగుంటలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పచ్చని పొలాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. భవిష్యత్తులో మరిన్ని సమ్మేళనాలు జరుపుకోవాలని తీర్మానించుకున్నారు.

# అన్నదాతకు సాయమెప్పుడో?

- ఖరీఫ్ సాగు పనులకు రైతులు సన్నద్ధం
- గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం
- కూటమి పాలనలో అన్నదాతలకు తప్పని తిప్పలు


ఖరీఫ్ పంటల సాగుకు దుక్కు చేస్తున్న రైతు


దేవరాపల్లిలో రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి (ఫైల్)

దేవరాపల్లి : అన్నదాతలను ఆదుకోవడంలో **కూటమి** ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. **ఎన్నికలకు** ముందు అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు **పెట్టుబడి** సహాయం అందించి అందుకుంటామని చెప్పిన **కూటమి** సర్కార్. నేటి వరకు రైతులకు చిల్లు గవ్వ కూడా **ఇవ్వకపోవ**డమే ఇందుకు నిదర్శనం. గత ఏడాది ఎటువంటి **సహాయం** అందించక పోగా కనీసం.. ఈ ఏడాది అయినా **పెట్టుబడి** సహాయం అందిస్తారని రైతులు వెయ్యి కళ్లతో ఎదు**రు చూస్తు**న్నారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ **అన్నదాత** సుఖీభవపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వక**పోవడంతో** అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభు**త్వం పెట్టు**బడి సహాయం అందించకుంటే ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అప్పులు చేయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ధరలు పెరగడంతో పాటు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులకు నష్టాలు తప్పడం లేదు. కూటమి సర్కార్ గత ఏడాది అందించక పోగా కనీసం ఈ ఏడాదైనా ఆదుకుంటుందని ఎదురు చూసిన అన్నదాతలకు నిరాశే మిగిలింది.

**వైఎస్సార్‌సీపీ హయాంలో అన్నదాతకు పెట్టపీట**

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్నదాతలకు పెద్ద పీట వేశారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి స్వగ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అందజేసి రైతు బాంధవుడిగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ రైతు భరోసా పేరిట ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే మే నెలలోనే క్రమం తప్పకుండా పెట్టుబడి సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు.

**మండలంలో రైతుల పరిస్థితి.....**

**దేవరాపల్లి మండలం ఖరీఫ్ సాగు అంచన సాగు విస్తీర్ణం** 3580 హెక్టార్లు కాగా ఖరీఫ్ వరి విత్తనాలను 1500 క్వింటాళ్లు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్నదాత సుఖీభవ పథకానికి 14వేల మంది వరకు రైతులకు వర్తింప చేయాల్సి ఉంది. ప్రస్తుతం అన్నదాతలు విత్తనాలు తీసుకుంటుండగా, మరికొందరు నారుమళ్ల తయారీలో నిమగ్నమయ్యారు.

### గత ప్రభుత్వంలో ఏటా పెట్టుబడి సాయం



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిన అన్నదాత సుఖీభవ డబ్బులు ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్ సమీపించిన పెట్టుబడికి చేతిలో చిల్లి గవ్వ లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. సాగు పనులు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జగన్ పాలనలో ప్రతీ ఏటా ఖరీఫ్‌కు సీజన్‌కు ముందే రైతు భరోసా డబ్బులు ఇచ్చేవారు. ధైర్యంగా వ్యవసాయ పనులు చేసుకునేవారం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ సొమ్ము అందించి ఆదుకోవాలి.

– వనుము లక్ష్మణ, రైతు, వెంకటరాజుపురం

### ఎన్నికల హామీ అమలు చేయాలి



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏటా రూ. 13,500 పెట్టుబడి సహాయం అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. చేతిలో పైసా లేక పోవడంతో సాగు పనులు ఎలా చేపట్టాలో అర్థం కావడం లేదు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సహాయం అందించాలి.

– పూట గురువునాయుడు, రైతు, తెనుగుపూడి గ్రామం

### ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు..



అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి 14,800 మందితో జాబితా ఇవ్వగా 9800 మంది వరకు రైతులతో జాబితాను సిద్ధం చేశాం. మిగిలిన వారిని వివిధ కారణాలతో అనర్హులుగా గుర్తించాం. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సహాయం ఎప్పుడిస్తారన్నది ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఖరీఫ్ వరి విత్తనాలను 1500 క్వింటాళ్లకు ఇండెంట్ పెట్టగా దాదాపుగా అన్ని రకాల విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. రైతు సేవా కేంద్రాలలో రైతులకు పంపిణీ చేస్తున్నాం.

– ఎల్.వై. కాంతమ్మ, మండల వ్యవసాయ అధికారి దేవరాపల్లి

## వరాహావతారంలో జగన్నాథుడు


వరహా అవతారంలో జగన్నాథుడు

మాడుగుల: స్థానిక ఇంద్రజ్యుమ్నం వద్ద వరాహ అవతారంలో జగన్నాథుడు భక్తులు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారు నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ అవతారంలో స్వామివారిని దర్శించకుంటే కోటి జన్మల పుణ్యం వస్తుందని, ఈ ప్రాంత భక్తులు విశ్వాసం. సాయంకాలం మండలం నలుమూలలు నుంచి వచ్చిన భక్తులు హరి భజనలు నిర్వహించారు.

**కూర్మావతారంలో జగన్నాథస్వామి**

చోడవరం : శ్రీజగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా కూర్మావతారంలో ఆదివారం భక్తులకు స్వామివారు దర్శన మిచ్చారు. చోడవరం శ్రీ కేశవస్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసి యున్న శ్రీ బలభద్రుడు, సుభద్ర సమేతుడైన శ్రీ జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు ఈ ఆలయంలో స్వామివారు దశావతారం రూపాల్లో భక్తులకు దర్శన మిస్తారు. రెండో రోజున స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలుచేసి భక్తులకుదర్శనం కల్పిస్తున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి పత్యేక పూజలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## నాటు తుపాకీలు ఉంటే అప్పగించాలి


ఎస్‌ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ : ఏజెన్సీ గ్రామాల్లో ఎవరివద్దనైనా నాటు తుపాకీలు ఉంటే వెంటనే పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్‌ఐలు తారకేశ్వర్రావు, రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గొలుగొండ మండలంలో ఉన్న రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారుగా 30 వరకు గిరిజన గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామ పరిధిలో ఎవరి వద్దనైనా నాటు తుపాకీలు ఉంటే వెంటనే అప్పగించాలని ఎస్‌ఐలు తెలిపారు. స్వచ్ఛందంగా తుపాకీలు ఉంటే అప్పగించకపోతే విచారణ చేసి ఉన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## విస్తృతంగా కర్ర పెండలం సాగు


గుల్లేపల్లిలో సాగులో ఉన్న కర్రపెండలం పంట

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో కర్ర పెండలం పంటను విస్తారంగా రైతులు సాగుచేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, ఎరకన్నపాలెం, పింద్రంగి గ్రామాల్లో 100ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండి సాగు వల్ల కర్ర పెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్టు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కర్ర పెండలం సాగు మరో 15 రోజుల్లో పంట చేతికి అందివస్తుందని సాగు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### చిరుజల్లులతో సరి...


గొండుపాలెంలో చిరుజల్లులతో కూడిన వర్షం

కె.కోటపాడు : వాతావరణంలో కలిగిన మార్పులతో రెండు రోజులుగా మండల వ్యాప్తంగా అడపాదడపా చిరుజల్లులు మాత్రమే కురుస్తున్నాయి. మెట్ట ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ సాగులో బాగంగా వేసవి వేరుశెనగ పంటకు చిరుజల్లులతో కూడిన వర్షం మేలు చేస్తుందని సాగు రైతులు తెలుపుతున్నారు. ప్రధానంగా ఎ.కోడూరు, కె.కోటపాడు, గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో గల సాగునీటి చెరువులు వర్షాలు లేక కళావిహీనంగా దర్శనమిస్తోన్నాయి. ఖరీఫ్ సాగు కాలం ప్రారంభం కావడం వల్ల భారీ వర్షాలు పడే పరిస్థితుల్లో ఈ సాగునీటి చెరువుల్లోనికి పుష్కలంగా వర్షపునీరు చేరుకుంటుందని రైతులు తెలుపుతున్నారు. మండల వ్యాప్తంగా చిరుజల్లులు పడుతుండడంతో పాటు సాగునీటి చెరువుల్లోనికి నీరు చేరుకోకపోవడంతో రైతుల్లో నిరాశ వ్యక్తం అవుతుంది.

## ఈ రోడ్లపై ప్రయాణం ఎలా?


తోటకూరపాలెం వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు


అధ్వానంగా తయారైన గుడ్డిప, తట్టబంద రోడ్డు

రావికమతం : మండలంలో గుడ్డిప, తోటకూరపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా తయారైంది. మండలం కేంద్రం తోటకూరపాలెం నుంచి 13 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి రావాలి. కానీ తోటకూరపాలెం, తట్టబంద, గుడ్డిప గ్రామాల వద్ద రోడ్డు పూర్తిగా గోతులుగా మారి చెరువులను తలపిస్తుంది. రోడ్లు ఎలా ఉన్నా మండల కేంద్రంలో ఉన్న పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వం ఆస్పత్రికి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, వివిధ పనులపై తరచూ వాహనాలపై వస్తూ వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే విజయరామరాజుపేట బ్రిడ్జి, వడ్డాది వద్ద బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి చేస్తామని చోడవరం ఎమ్మెల్యే రాజు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### ముమ్మరంగా ఖరీఫ్ వరి నారుమళ్లు

మాడుగుల రూరల్ : ఇటీవల ఆడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు బిజీ బిజీగా వరినారు మడులు వేసే పనిలో ఉన్నారు. రైతు సేవా కేంద్రాలు ద్వారా వరి విత్తనాలు కొనుగోలు చేసి, పంట పొలాల్లో వరి నారుమడుల్లో వరినారు వేసే పనిలో ఉన్నారు. కాగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆడపా దడపా వర్షం కురుస్తుంది. ఆదివారం కూడా ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఈ వర్షాలకు రైతులు వరి విత్తనాలు చల్లి నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

## రైతులకు కొబ్బరి, పండ్ల మొక్కలు పంపిణీ


దేవరాపల్లిలో పండ్ల మొక్కలను అందజేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు

దేవరాపల్లి : మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పండ్ల మొక్కలను ఆదివారం ఉచితంగా అందజేశారు. చెరువు గట్లుపైన నీటి గుంతలు వద్ద నాటేందుకు మొక్కలను సదరు రైతులకు అందజేసినట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో వై. రుక్మిణీదేవి తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ సరఫరా చేసిన మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కొబ్బరి మొక్కలు–430, సపోటా మొక్కలు–230, మామిడి–240, వేప, బాదం, మహాగని తదితర మొక్కలు 50 చొప్పున సరఫరా కాగా వీటిని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సన్యాసిరావు తదితర సిబ్బంది రైతులకు అందజేశారు.

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న కేజీబీవీ (టైప్-4)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ టైప్–4 కేజీబీవీని ప్రారంభిస్తామన్నారు. ఈ నేపథ్యంలో 9, 10 తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు ఉన్నత పాఠశాల హెచ్ఎం నారాయణరావును సంప్రదించాలన్నారు.

## బాడీబిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన


వడ్డాదిలో బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేస్తున్న యువకుడు


బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ చూపిన యువకులకు బహుమతులు అందిస్తున్న శివశంకర్

బుచ్చెయ్యపేట : యువత విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని టీమ్ ఇండియా ఆర్మీ, సర్వీసెస్ కోచ్ టి.శివశంకర్ (ఇతను ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ ఉద్యోగి) తెలిపారు. ఆదివారం సాయంత్రం వడ్డాదిలో ఎస్ఆర్ ఫిట్నెస్ జిమ్‌కోచ్‌లో బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన కల్పించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే జిమ్ సెంటర్‌లు పల్లె గ్రామీణ ప్రాంతంలో ఫిటెనెస్ సెంటర్ ఏర్పాటు చేసి యువత ఆరోగ్యం, ఫిటెనెస్‌కు ప్రాధాన్యం కల్పించిన జిమ్ నిర్వాహకుడు గండెం వెంకటేష్‌ను అభినందించారు. పలువురు యువకులు బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేశారు. జాతీయ బాడీ బిల్డర్ ఎస్.బాబి, ఒలింపియన్ వెయిట్ లిఫ్టర్ ఎం.వి.మాణిక్యాలు తదితరులు బాడీ బిల్డింగ్ చేసే విధానం, ఆహార నియమాలు, ఆరోగ్యం గురించి యువతకు అవగాహన కల్పించారు. బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ చూపిన యువతకు బహుమతులు అందించారు. నాయకులు, ఉపాధ్యాయులు దాడి చిన గోవింద, దొండా నారాయణమూర్తి, వర ప్రసాద్, వడ్డి సత్యారావు, రాంబి పాల్గొన్నారు.